క్లుప్తంగా

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ విజేత మడకశిర



మడకశిర జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని సీ కొడిగేపల్లి గ్రామంలో కాపు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ టీ–10 శ్రీ సత్యసాయి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ జరుగుతున్న విషయం తెలిసిందే. 10 రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 24 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఇందులో భాగంగానే బుధవారం మడకశిర ఎంటీఎస్ జట్టు, రొళ్ల ఫ్రెండ్స్ జట్టు తలపడగా మడకశిర జట్టు విజేతగా నిలిచింది. మాజీ మంత్రి రఘువీరారెడ్డి, సర్పంచ్ కవిత, టోర్నీ దాత సురేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విన్నర్స్ జట్టుకు రూ.లక్ష చెక్కుతో పాటు ట్రోఫీ, రన్నర్స్ జట్టుకు రూ.50 నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. అనంతరం టోర్నీ నిర్వాహకుడు కాపు సురేష్‌రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, టోర్నీ నిర్వాహకులు, క్రీడాకారులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, వైఎస్ ఎంపీపీలు, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు తప్పకుండా సమావేశానికి హాజరు కావాలన్నారు.

నిర్మాణ పనులు వేగవంతం



పల్లా లాడ్జి సమీపంలో డ్రైనేజీ నిర్మాణాలు పరిశీలిస్తున్న కమిషనర్

హిందూపురం: పట్టణంలోని రైల్వే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణ పనులు వేగవంతం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నంది సర్కిల్ నుంచి పల్లాలాడ్జి వరకు రోడ్డుకు ఇరువైపులా చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణాలు ఆయన పరిశీలించారు. ఇప్పటికే రైల్వే రోడ్డు విస్తరణకు స్థల విస్తరణ పనులు 90 శాతం పూర్తయ్యాయన్నారు. మరో పదిరోజుల్లో పూర్తిస్థాయిలో భవనాలు తొలగింపులు చేసి పనులు ముమ్మరం చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ నీరజా, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

హిందూపురం టౌన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నరేంద్ర బుధవారం పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని కోరారు.

రాఘవేంద్ర మఠంలో పూజలు

పెనుకొండ: పట్టణంలోని రాఘవేంద్ర మఠంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి సన్యాసం స్వీకరించిన రోజును పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు కోప్రేష్ స్వామి, శేషాద్రిరావు, రామారావు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నేడు గృహసారథులకు శిక్షణ

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి నంది విగ్రహం వెనుక భాగంలో వున్న ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్‌సీపీ గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ హాజరవుతారన్నారు.

కాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి



విదేశీయులతో కలసి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న శిల్పా

పెనుకొండ: మానవసేవయే మాధవ సేవగా భావించి పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన శివసాయి మందిరం వ్యవస్థాపకులు, దివంగత డాక్టర్ సాయికాళేశ్వర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్పా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శివసాయి మందిరంలో ఉచిత వైద్యశిబిరాన్ని శిల్పా ప్రారంభించారు. అంతకు ముందు సాయి కాళేశ్వర్ చిత్రపటం వద్ద పూజలు చేశారు. 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 58 మందికి వినికిడి పరికరాలు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో సిరులు

- సొంత రాష్ట్రాలను వీడి రొద్దానికి వలస వచ్చిన రైతులు
- భూముల ధరలు తక్కువ ఉండటంతో ఇక్కడికి వచ్చి వ్యవసాయం
- ప్రకృతి వ్యవసాయం ద్వారా పండ్ల తోటల సాగు
- లాభాలు గడిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న రైతులు

మితిమీరిన రసాయనాల ఎరువులు, పురుగు మందుల వాడకం అనర్థాలకు తావిస్తోంది. మట్టిలో సత్తువ తగ్గిపోయి సాగుకు మేలు చేసే సూక్ష్మ జీవులు కూడా అంతరించిపోతున్నాయి. ఈ క్రమంలో ఖర్చు నానాటికీ పెరుగుతూ గిట్టుబాటు దక్కక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ప్రకృతి సాగు దిశగా ఒక్కో అడుగు పడుతోంది. సాగు ఖర్చులు తగ్గించుకొని సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం పదిలంతో పాటు లాభాల బాట పట్టొచ్చని నిరూపిస్తున్నారు హరియాన, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు. వారి రాష్ట్రాల్లో భూముల ధరలు విపరీతంగా ఉండటంతో రొద్దం మండలంలో భూములు కొనుగోలు చేసి పంటలు సాగు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



తయారు చేసిన ద్రావణాలను డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన రైతులు

ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు గుల్జార్‌సింగ్. వీరిది హర్యానా రాష్ట్రం. రొద్దం పరిధిలో భూమిని కొనుగోలు చేసి 80 ఎకరాల్లో తైవాన్ రకం జామ వేశారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా సాగు చేస్తూ మంచి లాభాలు సాధిస్తున్నారు. ఎకరాలో జామ సాగు చేయడానికి రూ.90 నుంచి రూ.లక్ష దాకా ఖర్చు వస్తోందని గుల్జార్‌సింగ్ తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కాయలు కేసుకోవచ్చని పేర్కొన్నారు. ఖర్చులు పోను ఎకరంపై రూ.2 లక్షల ఆదాయం వస్తుందని చెబుతున్నారు.



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న జామ

రొద్దం: మండల వ్యాప్తంగా మండల వ్యాప్తంగా హరియానా, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన రైతులు దాదాపు రెండు వేల ఎకరాల భూములను కొనుగోలు చేశారు. వారి రాష్ట్రాల్లో భూముల ధరలు ఎక్కువగా ఉండటంతో రొద్దానికి వలస వచ్చారు. దీనికి తోడు అక్కడ వరి మాత్రమే సాగు చేయడానికి మాత్రమే అవకాశం ఉండటంతో ఇక్కడికి తరలివచ్చారు ఆంధ్రప్రదేశ్‌లో అన్ని పంటలు పండించడానికి భూములు అనుకూలంగా ఉండటంతో ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు వారు చెబుతున్నారు. భూములు కొనుగోలు చేయడమే కాదు పండ్లతోటలతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారు.

ప్రకృతి సేద్యం బాట...

రసాయన ఎరువులు, పురుగుల మందుల వినియోగంతో నిర్జీవమవుతున్న భూములకు జీవం పోసేందుకు వలస వచ్చిన రైతులు ప్రయత్నిస్తున్నారు. వ్యవసాయశాఖ, జెడ్‌పీఎన్ఎఫ్ కింద మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో దాదాపు రెండు వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేస్తున్నారు. నాలుగేళ్లుగా వ్యవసాయాధికారులు ప్రకృతి సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతులచే ప్రయోగాత్మకంగా పంటలు సాగు చేయిస్తున్నారు. ఆశించిన ఫలితాలు రావడంతో ఈ ఏడాది వందల ఎకరాల్లో ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తున్నారు.

పండ్ల తోటలే అధికం

మండలంలో 539 మంది రైతులు 559 ఎకరాల్లో ఎక్కువగా మామిడి, జామ, సపోటా, వివిధ చిరుధాన్యల పంటలు సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారానే రైతులు పంటలు పండిస్తున్నారు. పంటలపై చీడపీడలు ఆశించకుండా మొత్తం వివిధ కషాయాలు తయారు చేసి పంటలపై పిచికారీ చేస్తుండటంతో మంచి ఫలితాలను రాబడుతున్నారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తోంది. మండలంలో 539 మంది రైతులు 559 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. తమతో పాటు జెడ్‌పీఎన్ఎఫ్ వారు కలసి ఎప్పటికప్పుడు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. వారికి అన్ని విధాలా అండగా ఉంటున్నాం.

– నివేదిత, ఏఓ, రొద్దం

సీఎం నిర్ణయంపై దళితుల హర్షాతిరేకం



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న దళిత సంఘాల నాయకులు

పెనుకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు రెండు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించడం హర్షణీయమని దళిత సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రికి మద్దతుగా జై జగన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ,ఎస్టీ సెల్ విజిలెన్స్ మానిటరీ కమిటీ నాయకులు ఎం ఎన్.మూర్తి, మాజీ సర్పంచ్ చలపతి, కౌన్సిలర్ శేషాద్రి, ఎస్సీసెల్ నాయకులు గంగాధర్ తదితరులు హాజరయ్యారు.

మట్కా బీటర్ల అరెస్టు

హిందూపురం: పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో పలుచోట్ల దాడులు నిర్వహించి ముగ్గురు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి నుంచి మట్కా చీటీలతో పాటు రూ.2,00,270 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

గోదాము నిర్మాణానికి స్థల పరిశీలన

అమరాపురం: మండలంలోని హాలుకూరు గ్రామ సచివాలయం పరిధిలోని కాచికుంట గ్రామంలో వ్యవసాయ గోదాము నిర్మాణానికి సంబంధిత శాఖ డీఈ రఘునాథ్, ఎస్టీఎల్ సీఓ మునిరత్నం, సీఈఓ గురుమూర్తి తదితరులు అర ఎకరా భూమిని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గోదాము నిర్మాణానికి ప్రభుత్వం రూ.48 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు.

బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్‌బోన్

- బీసీలను ఓటుబ్యాంకుగా వాడుకున్నది చంద్రబాబే
- ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: 'చరిత్రలో ఇదివరకు ఎన్నాడూ లేని విధంగా సామాజిక న్యాయం అంటే ఏమిటో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో చేసి చూపుతున్నారు.. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించారు' అని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ కొనియాడారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఇక్బాల్ బీసీలంటే ఓటుబ్యాంక్ కాదు సమాజానికే బ్యాక్ బోన్‌లాంటివారు.. పరిపాలనలో నిజమైన భాగ్యస్వామ్యం అందించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమని ఆచారణలో చూపిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి 36 ఎమ్మెల్సీల్లో 25 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చారన్నారు. మంత్రి వర్గంలోనూ 70 శాతం బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలే ఉన్నారన్నారు. ఐదుగురు ఉపముఖ్యమంత్రుల్లో నలుగురు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చారంటే ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో చెప్పక్కరలేదన్నారు.

ఓటు బ్యాంకుగానే బీసీలు

టీడీపీ అధినేత చంద్రబాబు ఎప్పుడూ బీసీలను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకుని వదిలేశారని ఎమ్మెల్సీ ఇక్బాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబు పాలనలో... బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఎదగకుండా చేశారన్నారు. మైనార్టీ, ముస్లింలను కూడా న్యాయం చేయలేదని నారా హమరా సభలో నిలదీసిన ముస్లిం యువతపై దేశద్రోహం కేసులు పెట్టిన దుర్మార్గుడు చంద్రబాబన్నారు. లోకేష్ పాదయాత్రకు ప్రజల్లో ఆదరణ కరువైందని, ఆ యాత్రలో ఎటుపోతుందో కూడా తెలీడం లేదన్నారు. ప్రజల ఆదరణ కరువవడంతో సందులు గొందుల్లో సభలు పెట్టి జనానికి బలిచేయడం కపట రాజకీయ ఎత్తుగడని విమర్శించారు. దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదం ఉన్నంత వరకు జగన్‌మోహన్‌రెడ్డి దరిదాపుల్లోకి తోడేలన్నీ కలిసికట్టుగా వచ్చినా ఏమి చేయలేవని చెప్పారు. పట్టాభి కొట్టారని తప్పుడు ప్రచారాలు చేసే ఎల్లో మీడియా టీడీపీ దాడిలో గాయలపాలై ఆసుపత్రి పాలైన పోలీసుల గురించి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగేంద్రబాబు, పరుశురాముడు, నాగమణి, నాగేంద్రమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహమత్, నాయకులు సోమశేఖర్ రెడ్డి, శీన, ఇలియాజ్, లక్ష్మినారాయణ, మస్తాన్, ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సరస్వతి



మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరత్నమ్మ

పరిగి: ప్రభుత్వం శాశ్వతంగా భూసమస్యలను పరిష్కరించడానికి అమలు చేస్తున్న జగనన్న భూహక్కు–భూరక్ష పథకంతో ప్రతి ఒక్కరి వ్యవసాయ భూములు పదిలంగా ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ సరస్వతి మాట్లాడుతూ మండలాభివృద్ధికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. తహసీల్దారు సౌజన్యలక్ష్మీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ 90 రోజుల వ్యవధిలో జగనన్న లేఅవుట్ల ద్వారా ఇంటి పట్టాను మంజూరు చేస్తున్నామన్నారు. అయితే కొంతమంది లబ్ధిదారులు పొజిషన్ సర్టిఫికెట్లను అడుతున్నారని అలాంటి వారికి ఆన్‌లైన్‌లో ఎదురయ్యే ఇబ్బందులను సభలో చర్చించారు. ఎండీయూ ఏజెన్సీలు పక్కాగా రేషన్ సరుకులు అందించాలని స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. భూ రీసర్వేమొత్తం ఆరు గ్రామాల్లో జరుగుతోందని, మిగిలిన గ్రామాల్లో వచ్చే నెలలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా వేళలు మార్పు చేసిన విషయాన్ని రైతులకు తెలియజేయాలని ఏఈ నిజాముద్దీన్ సభ్యులను కోరారు. మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాని పలువురి అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయభారతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, కోఆప్షన్ సభ్యుడు సలీం, ఈఓఆర్డీ చంద్రశేఖర్, ఏపీఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ ఖాజా మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ వెంకటరత్నమ్మ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని తెలిపారు. హౌసింగ్ ఏఈ వాసంతి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణా పనులు పూర్తి చేయాలని సూచించారు. వైస్ ఎంపీపీ అంజినరెడ్డి మాట్లాడుతూ ఇంటి స్థలాలు ఉన్నవారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. సెబ్ అధికారులు మూడు సమావేశాలకు హాజరుకాకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నీలావతి, ఎంపీడీఓ నరసింహనాయుడు, డాక్టర్ వెంకట చిరంజీవి, ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరావు

హిందూపురం టౌన్: యువత నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని రాజకీయాల్లోనూ రాణించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సప్తగిరి కళాశాలలో భారత ప్రభుత్వ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో సంయుక్తంగా జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు పలు సూచనలు, సలహాలిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు , సప్తగిరి కళాశాల ప్రిన్సిపాల్లు నారాయణరెడ్డి, మంజునాథ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు యశోదా దేవి తదితరులు పాల్గొన్నారు.

అడదాకులపల్లిలో లీగల్ క్యాంప్

పెనుకొండ రూరల్: మండలంలోని అడదాకులపల్లి గ్రామంలో టింబక్ట కలేక్టివ్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు నిర్ణయాధికారం, మద్యపానం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. అనంతరం నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో మహాశక్తి సీఈఓ సొసైటీ అశ్విని, కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ పూజ



సరస్వతీ పూజాలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

లేపాక్షి: మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం సరస్వతీ పూజను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ నీలిమ క్రీడల్లో రాణించిన విద్యార్థినులకు బహుమతులు అందించారు.

'ఉయ్యాలవాడ'కు ఘన నివాళి



నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: తొలి స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశం కోసం ప్రాణాలర్పించిన మహావీరుడని రెడ్డి జేఏసీ నాయకులు కొనియాడారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రెడ్డి జేఏసీ కార్యాలయంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు పరమేష్‌రెడ్డి, మధన్‌గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నరేంద్రరెడ్డి, రమేష్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

మడకశిరరూరల్: మండలంలోని జీవీపాళ్యం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీఓ సోనీబాయి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం, ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదాయ వనరులను పెంపొందించుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈఓఆర్డీ శైలజ, ఉద్యోగులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

అమరాపురం: మండలంలోని ప్రతి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేయడానికి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ మునిస్వామి సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డులు ఉన్నవారిని పనులకు వచ్చేలా చూడాలన్నారు.

కోడ్ కూసినా..



ఆమిదాలగొందిలో ఎన్‌టీఆర్ విగ్రహానికి ముసుగు వేయని అధికారులు

మడకశిరరూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చి 13 రోజులు కావస్తున్నా మడకశిర మండలంలో మాత్రం సంబంధిత అధికారులు ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయకపోతున్నారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ఉన్న వివిధ రాజకీయ పార్టీల నేతలు విగ్రహాలకు ముసుగు వేయడంతో పాటు ఫ్లెక్సీలను కూడా అధికారులు తొలగించాల్సి ఉంది. కానీ మడకశిర మండలం ఆమిదాలగొంది పంచాయతీ కేంద్రంలో ప్రధాన రోడ్డు పక్కనే మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ విగ్రహం ఉన్న అధికారులు ముసుగు వేయకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరలోనే రోడ్డు సమస్య పరిష్కరిస్తాం

రొళ్ల: మండల పరిధిలోని బాజయ్యపాళ్యం గ్రామం నుంచి కురుబరహట్టికి వెళ్లడం కోసం రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, తిప్పప్ప, బాలక్రిష్ణ, దేవరాజు, నాగరాజు తదితరులు స్పందన కార్యక్రమంలో ఇటీవల అర్జీ ఇచ్చారు. ఇందులో భాగంగానే బుధవారం ఈఓఆర్డీ క్రిష్టప్ప, పంచాయతీ కార్యదర్శి రచన, రెవెన్యూ సిబ్బందితో కలిసి కురబరహట్టి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రోడ్డు ఏర్పాటు చేయడానికి కొలతలు వేసి హద్దులు గుర్తించారు. కురబరహట్టికి పూర్తిస్థాయిలో రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఓపెన్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మధ్యలో ఇంటర్ ఆపేసిన వారు ఓపెన్ ఇంటర్‌కు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ అంతరాయంపై నిరసన

గోరంట్ల: మండల పరిధిలోని బూదిలి సబ్‌స్టేషన్ కార్యాలయానికి బుధవారం రైతులు తాళాలు వేసి నిరసన తెలిపారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు



మాట్లాడుతున్న హిందూపురం ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు

హిందూపురం: జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో హిందూపురం 5వ స్థానంలో ఉందని దీనిని మొదటి స్థానానికి తీసుకురావడానికి చర్యలు చేపట్టమని హిందూపురం డిపో మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిందూపురం–బీహెచ్ఈఎల్‌కు రోజూ రాత్రి 9 గంటలకు నడిచే ఇంద్ర హైటెక్ సర్వీసులో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ప్రయాణికుడికి మినరల్ వాటర్ బాటిల్, శానిటైజర్, దుప్పటి, ఫేస్‌కిట్ ఇస్తున్నట్లు చెప్పారు. ఇక.. వచ్చే నెల 1 నుంచి ఆర్టీసీలో డ్రైవింగ్ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైవింగ్ శిక్షకులు ప్రసాద్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వర ఆలయం ప్రారంభం

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లిలో భక్తులు విరాళాలతో నూతనంగా నిర్మించిన శనీశ్వర స్వామి దేవాలయాన్ని బుధవారం అర్చకులు ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రొద్దం: పెద్దగువ్వలపల్లి గ్రామంలో బుధవారం వైస్ ఎంపీపీ అనితాలక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి కంటి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని కంటి వైద్య నిపుణుడు వెంకటరమణ చెప్పారు.